క్లుప్తంగా

120 మందికి వైద్య పరీక్షలు

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు వద్ద మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి వారు శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. కిమ్స్ డాక్టర్ ఆంజనేయులు పాల్గొని ఈసీజీ, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాలకోటయ్య, పీహెచ్‌సీలు రజితకుమారి, లలితమ్మ, నాగరాజి, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ అఖిత, ఆశా వర్కర్లు, కిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయకచవితి జరుపుకోవాలి

కొత్తపట్నం: వినాయకచవితి ఉత్సవాలను మండలంలో ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై వేముల సుధాకర్‌బాబు సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే వినాయకచవితి వేడుకల నేపథ్యంలో భక్తులు పాటించాల్సిన నియమ, నిబంధనలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేయాలనుకునే వారు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు చేసే ప్రజల కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు పొందేలా గణేష్ నెట్ అనే వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచిందన్నారు. అందులో అన్ని వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

స్వచ్ఛాంధ్రపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



స్వచ్ఛాంధ్ర గురించి విద్యార్థులకు వివరిస్తున్న కమిషనర్

చీమకుర్తి: స్వచ్ఛాంధ్ర, మాన్‌సూన్ హైజీన్ కార్యక్రమంలో భాగంగా శనివారం చీమకుర్తి జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో విద్యార్థినులకు మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య ఆధ్వర్యంలో స్థానిక నాయకులు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో తరచూ సంభవించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం, జిల్లాపరిషత్ హైస్కూలు పరిసరాలలో సైడు కాలువలను శుభ్రం చేశారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలు వన్‌టౌన్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మూడో శనివారం సందర్భంగా పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయం చుట్టుపక్కల పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యాలయం ఎదురుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హుల పింఛన్లు తొలగిస్తారా?

పొదిలి: సదరం సర్టిఫికెట్లు రీ వెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వం రాష్ట్రంలో లక్షా ఎనిమిది వేల మంది పింఛన్లు తొలగించారని దివ్యాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం అత్యవసర సర్వసభ్య సమావేశం జరిగింది. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. మదార్‌వలి మాట్లాడుతూ అనర్హులని పింఛన్లు తొలగించారు సరే, అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులపై చర్యలు ఉండవా.. అంటూ ప్రశ్నించారు. జిల్లా మెడికల్ బోర్డు అథారిటీ వారు ఇచ్చిన సదరం సర్టిఫికెట్టు రీవెరిఫికేషన్ చేయాలంటే ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డు అథారిటీ విశాఖపట్టణం వారు చేయాలని జీఓఎంఎస్ నెంబర్ 54 ద్వారా తెలుస్తుందన్నారు. రీవెరిఫికేషన్‌లో భాగంగా అవగాహన లేని కొంత మంది వైద్యులు అర్హులను కూడా అనర్హులుగా చూపారన్నారు. దీన్ని హక్కుల సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రీవెరిఫికేషన్‌కు హాజరు కావాల్సిన వారు రాష్ట్రంలో నాలుగు లక్షల మంది ఉండగానే హడావుడిగా ఆగమేఘాలపై అనర్హుల జాబితా ప్రకటించటం ద్వారా దివ్యాంగులు మానసిక వేదనకు గురయ్యారన్నారు. ఇక పింఛన్ రాదేమోననే వేదనలో కుంగిపోతున్నారన్నారు. రీవెరిఫికేషన్ పేరున అర్హుల పింఛన్లు తొలగిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమితి సభ్యులు మందుల కృష్ణ, సయ్యద్ ఆరిఫా, సుభానీ, సయ్యద్, రజాక్ పాల్గొన్నారు.

మహనీయుడు.. ప్రకాశం పంతులు



ఏకేయూలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, తదితరులు



చీమకుర్తిలో...

- జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఏకేయూ వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ:

భారతావని గర్వించదగిన మహనీయులలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు తన దైన శైలిలో ప్రత్యేక గుర్తింపు పొందారని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు కొనియాడారు. శనివారం స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గల సమావేశపు హాలులో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం పంతులు ధైర్య సాహసాలు, త్యాగనిరతి, పట్టుదల, ఉన్నతమైన గుణగణాలను కొనియాడారు. మారుమూల ప్రాంతంలో జన్మించిన ప్రకాశం పంతులు ఎంత ధైర్యశాలో, అదే తరహాలో త్యాగనిరతి, పట్టుదల కలిగిన మహనీయుడని అన్నారు. ఆ రోజుల్లో సైమన్ కమిషన్ మద్రాసు వచ్చినప్పుడు ఆయన చూపిన ధైర్యసాహసాలకు భారతావనిలో ప్రజలు ఆయన్ను ఆంధ్రకేసరిగా కొనియాడటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏకేయూ స్టూడెంట్స్ విభాగం డీన్ డాక్టర్ ఏ భారతీదేవి, హర్షప్రీతం దేవ్‌కుమార్, ఓఎస్డీ ప్రొఫెసర్ గుత్తి రాజమోహన్‌రావు, సీఈ ప్రొఫెసర్ జి.సోమశేఖర, సీడీసీ డీన్ డాక్టర్ కేవీఎన్ రాజు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో...

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆంధ్రకేసరి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి డిప్యూటీ గ్రంథపాలకురాలు సంపూర్ణ కాళహస్తి ఆధ్వర్యంలో నిర్వహించగా, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు దన్నారపు మస్తాన్‌రావు, యాక్సిస్ బ్యాంకు క్లస్టర్ మేనేజర్ బెజవాడ పావని, తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు గ్రంథాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథ పాలకుడు కే సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కరుణాకరరావు, ఆర్యవైశ్య నాయకుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను మండలంలోని ఆయన స్వగ్రామమైన వినోదరాయునిపాలెంలో గల జిల్లాపరిషత్ హైస్కూల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల ఆవరణలో ఉన్న ప్రకాశం పంతులు కాంస్య విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ ఘట్టమనేని అశోక్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళి, డీఆర్డీఏ పీడీ నారాయణ, ఎంపీడీఓ తేళ్ల రవికుమార్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, పాఠశాల హెచ్ఎం జి.చిట్టిబాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సంతనూతలపాడు గ్రంథాలయంలో...

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి: ప్రకాశం పంతులు సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం చీమకుర్తిలోని ప్రకాశం పంతులు విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి సీఐ ఎం.సుబ్బారావు, సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. అనంతరం పాటిమీద పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు కాపీరైటింగ్ పుస్తకాలు, పెన్నులు అందించారు.

రహదారుల ఆక్రమణ

- పట్టించుకోని అధికారులు

మద్దిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులను కొందరు ఆక్రమిస్తున్నా కింది స్థాయి నుంచి పైస్థాయి వరకూ అధికారులు, సిబ్బంది పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంపై మండల ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. గత సంవత్సరం గుండ్లాపల్లి గ్రామంలో రహదారిని ఆక్రమించడానికి కొందరు ప్రయత్నించగా, స్థానిక యువకులు అడ్డుకున్నారు. దీనిపై ఇప్పటి వరకూ ఏ అధికారీ స్పందించిన దాఖలాలు లేవు. ఆరు నెలల క్రితం తెల్లబాడు గ్రామంలో జాతీయ రహదారిని ఆక్రమిస్తున్నారని ఒక వర్గం వారిపై మరొక వర్గం వారు దాడి చేయడంతో కేసులు పెట్టుకున్నారు. తాజాగా నేలటూరివారిపాలెం చెరువు రోడ్డు ఆక్రమణకు గురవుతోందంటూ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా సదరు ఆక్రమణదారుడిని ఆపకపోవడంతో ఆ వ్యక్తి ఏకంగా శ్లాబ్ కూడా వేశాడని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే రహదారిపైకి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలందరిలో «ఆక్రమణదారులను ఎవరూ ఏమీ చేయడం లేదని, మనం కూడా ఆక్రమిద్దాం» అనే భావన కలుగుతోందని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అధికారులపై నమ్మకం కలిగేలా ప్రవర్తించాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ఒంగోలు టౌన్: రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం లేక అక్రమ కేసులతో వేధింపులకు గురవుతున్నారని జిల్లా రజకవృత్తిదారుల సంఘ ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య అన్నారు. పట్టణంలోని విజయనగరకాలనీ వాసులతో శనివారం ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని నివాసాలకు వెళ్లి దుస్తులు ఉతికి వస్తున్న క్రమంలో రజక మహిళలు, బాలికలు వేధింపులకు గురవుతున్నప్పటికీ నేటికీ సామాజిక రక్షణ చట్టం అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ నెల 25వ తేదీ ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ వెంకట క్రిష్ణయ్య, అవులమంద రమణమ్మ, చీమకుర్తి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి మంచికలపాటి శ్రీనివాసులు, సర్వేపల్లి యోగమ్మ, పోలయ్య, పద్మ, సుజాత, సుశీల, బసవమ్మ, మాధురి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాలకొండయ్య, తదితరులు

చెన్నకేశవునికి శాంతి పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న న్యాయమూర్తి భరత్ చంద్ర



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్

- స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి శనివారం శాంతి పూజలను ఆలయ అర్చకులు అప్పనాచార్యులు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చెన్నకేశవ స్వామి వారిని గిద్దలూరు కోర్టు న్యాయమూర్తి భరత్ చంద్ర దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్రను న్యాయమూర్తికి అర్చకులు వివరించారు. అనంతరం న్యాయమూర్తిని శేష వస్త్రాలతో సన్మానించారు. భక్తులు చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కంభం రోడ్డులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి శనివార ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారిని పూలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రమేష్ తదితరులు పాల్గొని భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బయోడైవర్సిటీ పద్ధతి ప్రకారం వ్యవసాయం చేయాలి

కొత్తపట్నం: బయోడైవర్సిటీ పద్ధతి ప్రకారం మోడల్‌గా వ్యవసాయం చేస్తే భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో శనివారం బయోడైవర్సిటీ పద్ధతిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్నంగి కోటిరెడ్డి అనే రైతు ఎకరా పొలంలో మెట్ట వరి సాగు చేయగా, బయోడైవర్సిటీ కోసం నవధాన్యాల మోడల్‌ను సాగు చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ పిల్లిపెసర 2 కేజీలు, పెసర 2 కేజీలు, ఉలవలు 2 కేజీలు, అలసందలు 2 కేజీలు, మినుములు 2 కేజీలు, తోట కూర 100 గ్రాములు, గోంగూర 250 గ్రాములు చొప్పున మొత్తం విత్తనాలను పొలంలో చల్లాలన్నారు. ఇవి మొలకెత్తిన తరువాత వర్షం పడటంగానీ, బోరు నీరు పెట్టిన తర్వాతగానీ కుళ్లి బయోడైవర్సిటీ జరుగుతుందన్నారు. తక్కువ వర్షం పడినప్పటికీ పంట దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. ఇలా చేయడం వలన మొక్క మొక్కకు కావాల్సిన పోషకాలను సమృద్ధిగా అందుతాయన్నారు. తద్వారా చీడపురుగులు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరిగి రైతులు మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. జిల్లాలో కొంత మంది రైతులచే ఇది చేయించడం జరుగుతుందని, ఫలితాలు కూడా వస్తున్నాయని అన్నారు. ఏఈవో అజయ్‌కుమార్, వీఏఏ నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, సురేష్, మాధురి, శిరీష, అరుణ, రైతులు పాల్గొన్నారు.



అల్లూరులో మాట్లాడుతున్న ఏఓ కిషోర్‌బాబు



మంచికలపాడులో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి భాస్కర్

పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి...

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్):సంతనూతలపాడు మండలంలోని రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని మండల వ్యవసాయాధికారి భాస్కర్ కోరారు. మండలంలోని మంచికలపాడు గ్రామంలో ఆత్మ సౌజన్యంతో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పొగాకు పంటకు బదులుగా జొన్న, అపరాలు, మొక్కజొన్న వంటి చిరుధాన్యాలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జి.కృష్ణ, మండల వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పనులు పునఃప్రారంభించాలి

మార్కాపురం టౌన్: మార్కాపురంతో పాటు రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాలల పనులను పూర్తి చేసి వాటిని ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు ఎం.రంగసాయిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మార్కాపురం మెడికల్ కళాశాల వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి ప్రజా సంకల్ప వేదిక నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పుల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన మెడికల్ కాలేజీలను స్థాపించి అందుకు రూ.8,480 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తు చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేశారని, అయితే వాటిలో 5 కళాశాలల ద్వారా 2023–24 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించారని, తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు విద్యార్థులు పొందారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నేతృత్వంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే ప్రణాళికను పున:పరిశీలించాలని కోరారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల అవసరమని, ఈ మేరకు నాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కళాశాలల నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. నిలిచిపోయిన కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంకల్ప వేదిక అవినీతి నిరోధక విభాగ రాష్ట్ర అధ్యక్షుడు జి.శివారెడ్డి, సమాచార హక్కు విభాగ రాష్ట్ర సలహాదారులు మల్లికార్జున, నాయకులు మహ్మద్ గౌస్, పవన్‌కుమార్, బాలు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంకల్పవేదిక నాయకులు

ఇరిగేషన్ పనుల్లో కొరవడిన పర్యవేక్షణ

కంభం: ఇరిగేషన్ కాలువల్లో మురుగు తొలగించే పనులపై పర్యవేక్షణ కొరవడి ప్రజాధనం వృథా అవుతోంది. ఈ ఏడాది మొదట్లో సుమారు రూ.40 లక్షలతో పట్టణంలోని పలు ఇరిగేషన్ కాలువల్లోని మురుగు తొలగించే కార్యక్రమం చేపట్టిన అధికారులు కొన్ని చోట్ల తొలగించిన మురుగు తరలించగా చాలా చోట్ల కాలువల పక్కనే అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో మరో మారు నిధులు మంజూరు కావడంతో అదే ఇరిగేషన్ కాలువల్లో మళ్లీ మురుగు తొలగించే పనులు చేపట్టి మురుగును తీసి కాలువల పక్కన గతంలో పడేసిన దానిపైనే పడేస్తున్నారు. మురుగంతా రోడ్డుపైకి పారి రాకపోకలు సాగించే పాదచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కందులాపురం సెంటర్ నుంచి పట్టణంలోకి వెళ్లే రహదారి, గౌతమి కాలేజ్ కి వెళ్లే రోడ్డుపై మురుగురోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగించారు. ఏడాది తిరగకముందే రెండు సార్లు కాలువల్లో మురుగు తొలగించే కార్యక్రమం చేపట్టినప్పటికీ పర్యవేక్షణ లోపించడంతో పనుల్లో నాణ్యత కనబడటం లేదన్న విమర్శలొస్తున్నాయి. ప్రస్తుతం రూ.46 లక్షలు మంజూరు కాగా 5 పంట కాల్వల్లో మురుగు తొలగించి, తూముల వద్ద చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తున్నారు. కాంట్రాక్టర్లు జేబులు నింపుకోవడానికి తప్పనిస్తే ప్రజలకు, రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పట్టణంలో మెయిన్ రోడ్డులో కాలువల్లో మురుగు తీసి గతంలో పోసిన దానిపైనే పోసిన దృశ్యం

బోగోలులో మినుము పంట ప్రదర్శన క్షేత్రం

అర్ధవీడు: మండలంలోని బోగోలు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో మినుము పంట క్షేత్ర ప్రదర్శన శనివారం ఏఓ శివ గంగప్రసాదు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మినుము పంట పూత దశలో ఉన్నందున తెల్ల దోమ ఆశించకుండా సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. అసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా వేప నూనె 500 ఎంఎల్ ఒక ఎకరానికి కలుపుకొని పిచికారి చేయాలని తెలిపారు. దీనివలన మినుము పంటలో పల్లాకుల తెగులు సమస్య నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగిరెడ్డి వెంకటరెడ్డి, వీఏఏ హస్మతు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గిద్దలూరు రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరు పూర్తి అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామ సమీపంలోని సెయింట్ జాన్సన్ స్కూల్, సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాల గురించి తెలుసుకోవడం వల్ల సమాజంలో ఎలా ప్రవర్తించాలో తెలుస్తుందన్నారు. న్యాయవ్యవస్థ ఉపయోగాలను గుర్తించాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరి పై ఉందని చెప్పారు. అనంతరం ముండ్లపాడు ఎస్సీ వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో నిర్మాణాలు పూర్తిస్థాయిలో నిర్మించకపోవడం పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశాడు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు



చిన్నదోర్నాలలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: అలివి కాని హామీలతో చంద్రబాబు ప్రజలను మోసగించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్నదోర్నాలలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, గుండారెడ్డి రమణారెడ్డి, చింతల చెరువు వెంకటరెడ్డి, గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి, చింతల చెరువు శివారెడ్డి, జంకె సుబ్బారెడ్డి, పెద్దిరాజులు ఖాశింపీరా, యలకపాటి విశ్వం పాల్గొన్నారు.

కేజీబీవీల పరిశీలన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న దేవానందరెడ్డి

దర్శి: నియోజకవర్గంలోని కేజీబీవీలను సమగ్ర శిక్షా సెక్రటరీ దేవానందరెడ్డి శనివారం పరిశీలించారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు కేజీబీవీలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో విజయపథం అనే రోజువారీ పరీక్షల తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అకడమిక్ విషయాలపై ఉపాధ్యాయులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులతో ముచ్చటించి స్కూల్ సౌకర్యాలు, పాఠ్యాంశాల వివరాల గురించి వాకబు చేశారు. మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత, పాఠశాలల్లో జరిగే సివిల్ వర్క్‌లు, సైన్స్ ల్యాబ్‌లు పరిశీలించారు. దేవానందరెడ్డి మాట్లాడుతూ 6 నుంచి 9 వరకు బేసిక్ విద్య, డిక్టేషన్‌లు కండెక్ట్ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. భాషా నైపుణ్యాలను పెంపొందించాలని ఆదేశించారు. ప్రిన్సిపాళ్లు యర్రంశెట్టి అరుణ, ఆవుల సునీత, ఎస్.పద్మావతి, సుజిత పాల్గొన్నారు.